విద్యార్థుల మరణాలపై ఎన్సీపీసీఆర్ సీరియస్

- పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు నోటీసు
- 15 రోజుల్లో నివేదిక ఇవ్వాలని ఆదేశం

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో విద్యార్థుల మరణాలపై జాతీయ బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ (ఎన్సీపీసీఆర్) సీరియస్ అయ్యింది. విద్యార్థులకు కల్తీ ఆహారం అందించడంపై ఆగ్రహం వ్యక్తంచేసింది. గురుకులాలు, సర్కారు పాఠశాలల్లో ఫుడ్ పాయిజన్‌తో 38 మంది విద్యార్థుల మరణం, 886 మంది అస్వస్థతకు గురికావడంపై న్యాయయవాది కొండా సాయిప్రసాద్ గౌడ్ ఎన్సీపీసీఆర్‌కు పలు పత్రికా కథనాలు జోడించి లిఖితపూర్వకంగా ఫిర్యాదుచేశారు. స్పందించిన కమిషన్ పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్‌కు నోటీసులు ఇచ్చింది. మరణాలపై 15 రోజుల్లో విచారణ చేపట్టి నివేదిక సమర్పించాలని ఆదేశించింది.

రాష్ట్రంలో 23 లక్షల మందికి బీపీ

- సుమారు 12 లక్షల మందికి షుగర్.. ఎన్సీడీ సర్వేలో వెల్లడి

హైదరాబాద్, జనవరి 2(నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో 30 ఏండ్లు దాటినవారిలో దాదాపు 23 లక్షల మందికి బీపీ, 12 లక్షల మందికి షుగర్ ఉన్నట్టు గుర్తించామని వైద్యశాఖ అధికారులు వెల్లడించారు. ఎన్సీడీ క్లినిక్‌లలో అందుతున్న సేవలపై వైద్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహ గురువారం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు ఎన్సీడీ సర్వే నివేదికను మంత్రికి అందజేశారు. 30 ఏండ్లు దాటిన 1.66 కోట్ల మందిని స్క్రీనింగ్ చేయగా, అందులో 22.94 లక్షల మందికి బీపీ, 11.9 లక్షల మందికి షుగర్ ఉన్నట్టు తెలిపారు. రోగులకు ఉచితంగా మందులు అందజేస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రోగులందరూ క్రమం తప్పకుండా మందులు వాడేలా చూడాలని తెలిపారు. ప్రభుత్వ దవాఖాన్లలో వసతులు, మందులు, డాక్టర్లు, సిబ్బంది హాజరు, తదితర అంశాలపై మంత్రి ఆరా తీశారు. కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్వీ కర్ణన్, తదితరులు పాల్గొన్నారు.

గురువారం తన నివాసంలో బోధన్ నియోజకవర్గ నేతల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కవిత, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా, బోధన్ మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, ఇతర నేతలు

ఎమ్మెల్సీ కవితను తన నివాసంలో గురువారం కలిసి నూతన సంవత్సర శుభాకాంక్షలు చెబుతున్న రాజ్యసభ ఎంపీ వద్దిరాజు రవిచంద్ర

నేడు బీసీల రణభేరి

మూడోపేజీ తరువాయి...

జయంతి సందర్భంగా బీసీల కార్యక్రమంపై ఆంక్షలా? అని మండిపడ్డాయి. అందుబాటులో ఉన్న బీసీ సంఘాల నేతలు ఎమ్మెల్సీ కవిత నివాసానికి చేరుకొని కార్యాచరణపై సమాలోచనలు జరిపారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు డీసీపీ సెంట్రల్ జోన్ ఆఫీస్ వద్ద పడిగాపులు కాసే దుస్థితిపై కవిత ఆగ్రహం వ్యక్తంచేశారు. హైదరాబాద్ సీపీతో ఆమె ఫోన్‌లోమాట్లాడారు. ఆమె విజ్ఞప్తికి హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్ సానుకూలంగా స్పందించారు. శుక్రవారం ఉదయం 11 నుంచి 4 గంటల వరకు ఇందిరాపార్క్ వద్ద జరిగే సభకు ఎట్టకేలకు అనుమతించారు.

బీసీ మహాసభకు పెద్ద ఎత్తున రావాలి: కవిత

అసెంబ్లీ ఎన్నికల ముందు బీసీలకు కాంగ్రెస్ ఇచ్చిన హామీలను విస్మరించిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ధ్వజమెత్తారు. అధికారంలోకి వచ్చాక కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు వెన్నుపోటు పొడిచిందని విమర్శించారు. కామారెడ్డి డిక్లరేషన్, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42% రిజర్వేషన్లు అమలు అయ్యేదాకా తమ పోరాటం కొనసాగిస్తామని కవిత ప్రతినబూనారు. శుక్రవారం ఉదయం 11 గంటలకు ఇందిరా పార్కు వద్ద ప్రారంభమయ్యే ఈ బీసీ మహాసభకు పెద్ద ఎత్తున రావాలని కవిత పిలుపునిచ్చారు.

విద్యార్థి జేఏసీ, అంబేద్కర్ యువజన సంఘం మద్దతు

ఇందిరాపార్క్ వద్ద ఎమ్మెల్సీ కవిత నేతృత్వంలో జరిగే బీసీ మహాసభకు మద్దతు ఇస్తున్నట్టు తెలంగాణ అంబేద్కర్ యువజన సంఘం, ఓయూ జేఏసీ చైర్మన్ డాక్టర్ బండారు వీరబాబు గురువారం తెలిపారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు కోసం కవిత చేస్తున్న పోరాటంలో భాగస్వాములం అవుతామని వెల్లడించారు. ఓయూ ఆర్ట్స్ కాలేజీ నుంచి భారీగా తరలివస్తామని తెలిపారు. పూసల సంఘం తెలంగాణ రాష్ట్ర యూత్ అధ్యక్షుడు కోనేరు సురేశ్‌కుమార్ కూడా మద్దతు ప్రకటించారు. కాంగ్రెస పార్టీ ఆరు గ్యారంటీలను అమలు చేయకపోగా, బీసీలను మోసం చేసిందని బీఆర్ఎస్వీ నేత అప్పల శేఖర్ యాదవ్ మండిపడ్డారు.

కడ్తాల్‌లో పోస్టర్ ఆవిష్కరణ

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత సారథ్యంలో నిర్వహిస్తున్న బీసీ మహాసభ పోస్టర్‌ను కల్వకుర్తి నియోజకవర్గం కడ్తాల్ మండల కేంద్రంలో పలువురు ప్రముఖులు ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి, ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్, బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మిషన్ భగీరథ మాజీ వైఎస్ చైర్మన్ ఉప్పల వెంకటేశ్, రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ దశరథ్‌నాయక్, సర్పంచుల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, మాజీ ఎంపీపీ నిర్మలా శ్రీశైలంగౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ గంప వెంకటేశ్, తెలంగాణ ఆరెకటిక సంఘం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కల్యాణ్‌కార్ జాంగిర్, రంగారెడ్డి జిల్లా బీసీ మహాసభ ఉపాధ్యక్షుడు సంపంగి శ్రీశైలం, నాయకులు కల్యాణ్‌కార్ శంకర్, అండేకార్ సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిలో బీసీలకు ఏం చేసిర్రు?

- బీఆర్ఎస్వీ నేత శ్రీకాంత్

ఏడాది పాలనలో కాంగ్రె ప్రభుత్వం బీసీలకు ఏం చేసిందో చెప్పాలని బీఆర్ఎస్వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తొన్పునూరి శ్రీకాంత్ డిమాండ్ చేశారు. కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని కోరారు. ఏటా బీసీ సబ్‌ప్లాన్ కోసం రూ.20 వేల కోట్లు కేటాయిస్తామని చెప్పిన కాంగ్రెస్.. బడ్జెట్‌లో కేవలం రూ.150 కోట్లే కేటాయించిందని విమర్శించారు. ఎమ్మెల్సీ కవితపై పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ చేసిన వ్యాఖ్యలను బేషరతుగా వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బేషరతుగా రైతు భరోసా ఇవ్వాలి

- అన్నదాతలకు షరతులు పెట్టడమేమిటి?
- ఏడాదిలోనే సర్కార్‌పై పెరిగిన అసంతృప్తి
- నిత్యం రైతు క్షేమానికే పాటుపడిన కేసీఆర్
- స్థానిక ఎన్నికల్లో గులాబీజెండానే ఎగరేద్దాం
- బీఆర్ఎస్ బోధన్ కార్యకర్తల సమావేశంలో కవిత

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ఎలాంటి షరతులు లేకుండా బేషరతుగా రైతులందరికీ రైతు భరోసా నిధులు ఇవ్వాలని ఎమ్మెల్సీ కల్వంకుంట్ల కవిత రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పథకానికి నిబంధనలు విధిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అన్నదాతలను మరింత ఇబ్బందులకు గురిచేయాలని చూస్తున్నారని విమర్శించారు. హైదరాబాద్‌లోని తన నివాసంలో గురువారం బీఆర్ఎస్ బోధన్ నియోజకవర్గ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు భరోసా పథకానికి కూడా దరఖాస్తులను స్వీకరించాలని ప్రభుత్వం నిర్ణయించాలని అనుకోవడం దారుణమని పేర్కొన్నారు. రైతులను వ్యవసాయం చేసుకోనిస్తారా లేదా ప్రభు త్వ కార్యాలయాల చుట్టూ తిప్పుకుంటూ తిప్పలు పెడుతారా? అని కవిత ప్రశ్నించారు. కేసీఆర్ రైతాంగాన్ని కడుపులో పెట్టుకొని కాపాడుకుంటే, కాంగ్రెస్ పాలకులు రైతాంగాన్ని అవస్థలపాలు చేస్తున్నారని చెప్పారు. షరతులు, నిబంధనల పేరిట లక్షలాది మంది రైతులకు పెట్టుబడి సాయాన్ని ఎగవేసే యత్నం చేస్తున్నారని ధ్వజమెత్తారు. రైతు సంక్షేమాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని మండిపడ్డారు. ఏడాదిలోనే కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్నదని తెలిపారు.

హామీల అమలుపై గళమెత్తుదాం

రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, ఇతర హామీల అమలు కోసం అందరం గళమెత్తుదామని ఎమ్మెల్సీ కవిత పిలుపునిచ్చారు. మహిళలకు నెలకు రూ. 2,500, 18 ఏళ్లు నిండిన ఆడబిడ్డలకు స్కూటీలు, కల్యాణలక్ష్మి కింద తులం బంగారం ఇస్తామన్న హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని ధ్వజమెత్తారు. రుణమాఫీ పేరిట రైతులను మోసం చేసిన సీఎం రేవంత్‌రెడ్డి ఇప్పుడు రైతు భరోసాకు షరతులు విధించి దగా చేసేందుకు సిద్ధమయ్యారని ఆగ్రహం వ్యక్తంచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని, ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు. గతంలో కేసీఆర్ అమలుచేసిన పథకాలు, కార్యక్రమాల వల్ల కలిగిన ప్రయోజనాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని వివరించారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని, సమిష్టిగా పనిచేసి ఊరూరా గులాబీ జెండాను ఎగరవేయాలని పిలుపునిచ్చారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్యే షకీల్ సతీమణి అయేషా ఫాతిమా, నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేశ్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

- మైనార్టీ ఉద్యోగుల క్యాలెండర్ ఆవిష్కరణ

తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఎంప్లాయీస్, స్టాఫ్ అసోసియేషన్ (మెసా) రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను హైదరాబాద్ జలసౌధలో ఇరిగేషన్ శాఖ ఈఎన్సీ అనిల్‌కుమార్ గురువారం ఆవిష్కరించారు. విజిలెన్స్ ఈఈ శారద, మెసా అధ్యక్షుడు జమీర్ పాషా, ప్రధాన కార్యదర్శి మహ్మద్ గౌస్, సలహాదారు ఎండీ అజ్మల్ ఖాన్, వర్కింగ్ ప్రెసిడెంట్ అస్మత్ అలీ, షేక్ ఖాదర్ వలీ, తదితరులున్నారు.

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, బీఆర్ఎస్ లీగల్ సెల్ ఇన్‌చార్జి సోమా భరత్‌కుమార్

జడ్జీల నియామకం చేపట్టాలి

భర్తీలో సామాజిక న్యాయం పాటించాలి: వినోద్‌కుమార్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): హైకోర్టులో న్యాయమూర్తుల నియామకం చేపట్టాలని, ఇందుకు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ విజ్ఞప్తి చేశారు. తెలంగాణభవన్‌లో గురువారం బీఆర్ఎస్ లీగల్‌సెల్ ఇన్‌చార్జి సోమా భరత్‌కుమార్‌తో కలిసి ఆయన మీడియాతో మాట్లాడారు. 2019 డిసెంబర్ 31న లోక్‌సభలో వేసిన ప్రశ్న ఫలితంగా తెలంగాణకు హైకోర్టు వచ్చిందని గుర్తుచేశారు. తెలంగాణ హైకోర్టుకు 42 మంది జడ్జీలు ఉండాలని నిర్ణయం తీసుకున్నా, 23 మందికి మించి భర్తీ చేయడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. పూర్తిస్థాయిలో జడ్జీలను నియమిస్తే ఎంతోమంది అర్హులైన దళిత, గిరిజనవర్గాలకు న్యాయం జరుగుతుందని తెలిపారు. కేసీఆర్ హయాంలో తాము పార్లమెంటులో చేసిన ఒత్తిడి ఫలితంగానే హైకోర్టు జడ్జీల సంఖ్యను 42కు పెంచారని గుర్తుచేశారు. హైకోర్టులో పెండింగ్ కేసుల సంఖ్య నానాటికీ పెరిగిపోతున్నదని, న్యాయమూర్తులు పూర్తిస్థాయిలో ఉంటే తప్ప కేసులు త్వరితగతిన పరిష్కారం కావని పేర్కొన్నారు.

మెట్రోతోపాటు స్కైవే నిర్మించండి..

హైదరాబాద్‌లోని జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు మెట్రో రైలుమార్గాన్ని పొడిగించడంతోపాటు డబుల్ డెక్కర్ స్కైవే నిర్మించాలని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశారు. అప్పుడే సిద్దిపేట, కరీంనగర్, పెద్దపల్లి, మంచిర్యాల, ఆసిఫాబాద్ జిల్లాల ప్రజలకు కరీంనగర్-హైదరాబాద్ మధ్యలో ట్రాఫిక్ ఇబ్బందులు తొలగిపోతాయని పేర్కొన్నారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు మెట్రోమార్గాన్ని విస్తరించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించడం సంతోషకరమని చెప్పారు. పైన మెట్రో, మధ్యలో ఫ్లైఓవర్, కిందిభాగంలో రోడ్డు కలిపితే డబుల్ డెక్కర్ స్కైవే అంటారని, వీటిని నాగ్‌పూర్, జైపూర్‌లో నిర్మించగా విజయవంతమైనట్టు తెలిపారు. కరీంనగర్ మార్గంలో హైదరాబాద్ నుంచి శామీర్‌పేట వరకు 18.5 కిలోమీటర్ల డబుల్ డెక్కర్ స్కైవే నిర్మిస్తే ఐదు జిల్లాల ప్రజలకు హైదరాబాద్ రాకపోకలు సాఫీగా సాగుతాయని చెప్పారు. డబుల్ డెక్కర్ ఫ్లైఓవర్ నిర్మాణం కోసం రక్షణశాఖ భూములు ఇవ్వాలని బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే నాటి రక్షణ శాఖ మంత్రిని కలిసి విన్నవించినట్టు గుర్తుచేశారు. సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు పన్నాల భూపతిరెడ్డి, గవ్వా వంశీధర్‌రెడ్డి, బక్క నాగరాజు, ఉపేంద్ర, మహ్మద్ ఫయాజ్ పాల్గొన్నారు.

'బిల్డ్ నౌ' పై కొరవడిన అవగాహన

ఫిబ్రవరి 1 నుంచి అందుబాటులోకి వెబ్‌పోర్టల్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): రియల్ ఎస్టేట్ వ్యాపారానికి సంబంధించిన అనుమతులన్నీ ఒక గొడుగు కిందకు తీసుకువస్తూ రాష్ట్ర ప్రభుత్వం 'బిల్డ్ నౌ' పేరిట తీసుకొస్తున్న పోర్టల్ గురించి మున్సిపాలిటీ అధికారులు, రియల్ వ్యాపారులు, ప్రజలకు పూర్తిగా అవగాహన రాలేదు. అయినప్పటికీ ఫిబ్రవరి ఒకటి నుంచి పోర్టల్‌ను అందుబాటులోకి తీసుకువస్తున్నట్టు ప్రకటించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు జరుగుతున్నట్టు మంత్రి శ్రీధర్‌బాబు ఇటీవల ప్రకటించారు. అయితే మున్సిపాలిటీలలో 'బిల్డ్ నౌ' గురించి గాని, అందుకు సంబంధించిన పోర్టల్ గురించి కాని, దీని ద్వారా రియల్ అనుమతులు ఎలా మంజూరు చేయాలి? వ్యాపారులు పోర్టల్‌లో సమాచారం ఎలా అప్‌లోడ్ చేయాలి ? తదితర విషయాలపై అస్పష్టతగానే ఉందని అంటున్నారు. కొత్తగా వచ్చే పోర్టల్‌పై మున్సిపల్ కమిషనర్లకు, క్షేత్ర స్థాయి అధికారులకు, సిబ్బందికి కనీసం అవగాహన కల్పించలేదు.

మెట్రో విస్తరణ ప్రజా విజయం

- ఏడాదికాలంగా ముఖ్యమంత్రి రేవంత్ తిరోగమన నిర్ణయాలు
- అన్ని వ్యవస్థలను ధ్వంసం చేశారు
- కేసీఆర్ చేపట్టిన ప్రాజెక్టులు ఆపారు
- కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే వివేకానంద
- తొలి ప్రాధాన్యంగా చేపట్టాలి
- ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి
- రేవంత్‌వి తుగ్లక్ నిర్ణయాలు: బాల్క

తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): ప్రజలు, బీఆర్ఎస్ పార్టీ సాగించిన పోరాటాల ఫలితంగానే మెట్రో రైలు ప్రాజెక్టును జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు, ప్యారడైజ్ నుంచి మేడ్చల్ వరకు విస్తరించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నదని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు పేర్కొన్నారు. హైదరాబాద్ ఉత్తరం భాగంలో మెట్రో ప్రాజెక్టును విస్తరించాలని ప్రజలు చేసిన ఉద్యమానికి సీఎం తలవంచక తప్పలేదని వ్యాఖ్యానించారు. గురువారం తెలంగాణభవన్‌లో బీఆర్ఎస్ కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా కేపీ వివేకానంద మాట్లాడుతూ.. ఏడాదిగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తిరోగమన నిర్ణయాలు తీసుకుంటూ, తెలంగాణ అభివృద్ధిని కుంటుపడేలా చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు కేసీఆర్ ప్రభుత్వం మెట్రో మూడో దశ విస్తరణపై నిర్ణయం తీసుకున్నదని, కన్సల్టెంట్‌ను కూడా నియమించిందని గుర్తుచేశారు. ఏడాదిగా మెట్రోపై కాలయాపన చేసి చివరికి తాజాగా కేసీఆర్ ప్రభుత్వంలో తీసుకున్న నిర్ణయాన్నే రేవంత్ ప్రకటించారని చెప్పారు. హైదరాబాద్‌ను వరల్డ్‌క్లాస్ సిటీగా మార్చేందుకు కేసీఆర్ రోడ్‌మ్యాప్ తయారుచేశారని, ఏడాదిగా గత ప్రభుత్వ నిర్ణయాలను అమలుచేసి ఉంటే తెలంగాణ పురోగమన దిశలో ఉండేదని పేర్కొన్నారు. కాంగ్రెస్ నేతలతో తాను మారిన మనిషినంటూ రేవంత్ చెప్పినట్టు వార్తలు వచ్చాయని, అంటే ఏడాది కాలంలో తన చర్యలు తప్పు అని ఆయనే ఒప్పుకుంటున్నారని ఎద్దేవాచేశారు. కేసీఆర్ తెలంగాణ అభివృద్ధికి వేసిన రోడ్‌మ్యాప్‌ను రేవంత్ అమలుచేయక తప్పదని, మెట్రో తాజా ప్రతిపాదనలు బీఆర్ఎస్, ప్రజలు సాధించిన విజయమని పేర్కొన్నారు. రాయదుర్గ్ నుంచి శంషాబాద్ వరకు మెట్రో విస్తరణకు కూడా రేవంత్ పూనుకోవాలని డిమాండ్ చేశారు. పది లక్షల మంది ఐటీ ఉద్యోగులు ఉన్న ప్రాంతంలో మెట్రో విస్తరణ గురించి ఎందుకు ఆలోచించరు? అని ప్రశ్నించారు. జేబీఎస్ నుంచి శామీర్‌పేట వరకు ఎలివేటెడ్ కారిడార్‌కు సీఎం రేవంత్ శంకుస్థాపన చేసినా ఇప్పటివరకు తట్టెడుమట్టి తీయలేదని విమర్శించారు.

రేవంత్‌వి తుగ్లక్ నిర్ణయాలు: బాల్క సుమన్

ఏడాది పాలనలో రేవంత్‌రెడ్డి ఎన్నో తుగ్లక్ నిర్ణయాలు తీసుకున్నారని, కొత్త సంవత్సరం లోనైనా తిరోగమన చర్యలు ఆపాలని మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ డిమాండ్ చేశారు. 400 రోజుల్లో రాష్ట్రాన్ని అధోగతి పాలుచేశారని మండిపడ్డారు. మెట్రో, ఫార్మాసిటీ ప్రాజెక్టులపై రేవంత్ తీరు తుగ్లక్‌ను మరిపిస్తున్నదని విమర్శించారు. కేసీఆర్ హయాం లో తీసుకున్న నిర్ణయాలను మొదట్లో రేవంత్ రద్దు చేసి ఏడాది తర్వాత మళ్లీ వాటినే అమలు చేస్తున్నారని గుర్తుచేశారు. రేవంత్ సంపాదనలో రవ్వంత కాదు.. కొండంతగా మారారని, ఏడు తరాలు తిన్నా తరగని ఆస్తిని ఇప్పటికే పోగు చేసుకున్నారని విమర్శించారు. వ్యక్తుల మీద కక్షతో వ్యవస్థలను నాశనం చేయొద్దని హితవుపలికారు.

తొలి ప్రాధాన్యంగా చేపట్టాలి: మర్రి రాజశేఖర్‌రెడ్డి

హైదరాబాద్ ఉత్తర భాగం మెట్రో పనులను ద్వితీయ ప్రాధాన్యంగా కాకుండా, తొలి ప్రాధాన్యంగా చేపట్టాలని ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మేడ్చల్, శామీర్‌పేటకు మెట్రో రైలు ప్రాజెక్టు అనేది కేసీఆర్ హయాంలోనే తీసుకున్న నిర్ణయమని గుర్తుచేశారు. కేంద్రం నుంచి సాయం వస్తేనే పనులు చేపడతామని అనడం సరికాని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో అయినా చేపట్టాలని కోరారు. మెట్రో విస్తరణ పనులు ఎప్పటివరకు పూర్తి చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.

బొంరాస్‌పేట ఠాణాకు పట్నం నరేందర్‌రెడ్డి

- లగచర్ల కేసులో మూడు గంటలపాటు విచారణ

నాంపల్లి క్రిమినల్ కోర్టులు, జనవరి 2 (నమస్తే తెలంగాణ)/కొడంగల్ : వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గంలోని లగచర్ల రైతులతోపాటు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డిపై నమోదైన కేసులో బొంరాస్‌పే ట్ పోలీసులు విచారణ చేపట్టారు. ఫార్మా క్లస్టర్ నిర్మాణం కోసం భూముల్ని ఇవ్వాలని ప్రభుత్వం తరపున కొనసాగుతున్న సర్వేలను వ్యతిరేకించడంతో మాజీ ఎమ్మెల్యే పట్నం పేరును సైతం చేర్చిన విషయం తెల్సిందే. మాజీ ఎమ్మెల్యేకు ఇటీవల షరతులతో కూడిన బెయిల్ మంజూరైంది. క్రైమ్ నంబర్ 145 కేసులో విచారణకు హాజరు కావాలని జారీ చేసిన నోటీసుల మేరకు గురువారం ఆయన బొంరాస్‌పేట్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి విచారణ అధికారి అడిగిన ప్రశ్నలకు జవాబులు ఇచ్చారు. ఈ కేసుతో తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పినట్టు సమాచారం. కక్షపూరితంగా తనపై కేసు నమోదు చేసినట్టు పట్నం చెప్పినట్టు తెలిసింది. విచారణ దాదాపు 3 గంటలపాటు సాగింది.

నేడు సురేశ్ కస్టడీపై తీర్పు

లగచర్ల రైతులపై నమోదైన కేసులో రెండో ముద్దాయిగా ఉన్న సురేశ్‌ను 4 రోజులపాటు కస్టడీకి అప్పగించాలని కోరుతూ బొంరాస్‌పేట్ పోలీసులు దాఖలు చేసిన పిటిషన్‌పై శుక్రవారం ఇన్‌చార్జి ఏసీబీ కోర్టు జడ్జీ మహ్మద్ అఫ్రోజ్ అక్తర్ తీర్పును వెలువరించనున్నారు. ఇటీవల నిందితుడి తరపున దాఖలు చేసిన బెయిల్ పిటిషన్‌పై సీనియర్ న్యాయవాది ఏకాంబరమ్ వాదనలు వినిపించారు. పోలీసుల తరపున పీపీ వాదనలు పూర్తి చేయాల్సి ఉన్నది. ఇద్దరిని కూడా కస్టడీకి కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేశారు.

లగచర్ల కేసులో ముందస్తు బెయిల్ పిటిషన్

హైదరాబాద్, జనవరి 2 (నమస్తే తెలంగాణ): లగచర్లలో అధికారులపై దాడికి సంబంధించిన కేసులో ముందస్తు బెయిలు మంజూరు చేయాలని కోరుతూ 12 మంది రైతులు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై హైకోర్టు గురువారం విచారణ చేపట్టింది. రాష్ట్ర ప్రభుత్వానికి, బొమ్రాస్‌పేట పోలీసులకు నోటీసులు జారీచేసింది. సమగ్ర వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను న్యాయమూర్తి జస్టిస్ కే లక్ష్మణ్ ఈ నెల 9కి వాయిదా వేశారు.

మరింత సమయం కావాలి

- ఈడీ డైరెక్టర్‌కు బీఎల్ఎన్‌రెడ్డి మెయిల్
- సమయం ఇవ్వలేమని స్పష్టంచేసిన ఈడీ

హైదరాబాద్, జనవరి2 (నమస్తేతెలంగాణ): ఫార్ములా-ఈ కేసులో విచారణకు హాజరయ్యేందుకు తనకు మరింత సమయం కావాలని హెచ్ఎండీఏ మాజీ చీఫ్ ఇంజినీర్ బీఎల్ఎన్‌రెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)ని కోరారు. ఈ కేసులో ఆయన ఏ3గా ఉన్న విషయం తెల్సిందే. ఈ కేసు విచారణలో భాగంగా షెడ్యూల్ ప్రకారం గురువారం రావాలని బీఎల్ఎన్‌రెడ్డికి ఈడీ డైరెక్టర్ గత నెల 27న నోటీసులు జారీ చేశారు. అయితే ఆయన తాను ఇప్పటికిప్పుడే రాలేనని, డాక్యుమెంట్ల సమర్పణకు రెండు, మూడు వారాల గడువు కావాలని ఈడీ డైరెక్టర్‌కు మెయిల్ ద్వారా సమాచారం అందించారు. అలాగే ఈ కేసులో ఏ2గా ఉన్న అప్పటి హెచ్ఎండీఏ స్పెషల్ కమిషనర్, పురపాలక శాఖ ప్రత్యేక ప్రధానకార్యదర్శి అర్వింద్‌కుమార్ కూడా శుక్రవారం విచారణకు రాలేనని తెలియజేశారు. దీనిపై స్పందించిన ఈడీ అధికారులు వారడిగిన సమయం ఇవ్వలేమని స్పష్టం చేశారు. ఈ నెల 8న బీఎల్ఎన్‌రెడ్డి, 9న అర్వింద్‌కుమార్ హాజరుకావాల్సిందేనని చెప్పారు.

కేసు నేపథ్యం..

హైదరాబాద్‌లో ఫార్ములా-ఈ రేస్ నిర్వహణకు 2023 అక్టోబర్‌లో హెచ్ఎండీఏ ద్వారా రూ.55 కోట్లను ఫార్ములా-ఈ రేసు నిర్వాహకులకు చెల్లించారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా చెల్లింపులు జరిగాయని, మంత్రివర్గ ఆమోదం కూడా లేనందున ఆ చెల్లింపులు చట్టవిరుద్ధమని పేర్కొంటూ 2023 డిసెంబర్ 18న హెచ్ఎండీఏ కమిషనర్ దానకిశోర్ ప్రభుత్వానికి ఫిర్యాదు చేశారు. దీంతో ప్రభుత్వం విచారణ చేపట్టాలని అవినీతి నిరోధక శాఖను ఆదేశించింది. ఈ మేరకు ఏసీబీ అధికారులు డిసెంబర్ 19న ఈ వ్యవహారంపై కేసు ఫైల్ చేశారు. ఈ కేసులో ఏ1గా మాజీ మంత్రి కేటీఆర్, ఏ2గా అర్వింద్‌కుమార్, ఏ3గా బీఎల్ఎన్‌రెడ్డిల పేర్లను చేర్చారు. అయితే ఏసీబీ నమోదు చేసిన కేసును ఆధారంగా చేసుకొని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ కూడా దర్యాప్తు మొదలు పెట్టింది.

- గుండెనిండా గులాబీ బాస్

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా టేకులపల్లి మండలం మూడ్‌తండాకు చెందిన మూడ్ రమేశ్, రాంబాయి దంపతులు ఎకరం భూమిలో వ్యవసాయం చేసుకుంటూ ఇద్దరు పిల్లలను పోషించుకుంటున్నారు. కేసీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత పదేళ్ల కా